క్లుప్తంగా...

ప్రశాంతంగా గ్రూప్‌ 4 పరీక్ష

రామంతపూర్: స్థానిక ప్రిన్సిపల్ పీజీ కళాశాల, మెగా జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గ్రూప్‌–4 పరీక్షను శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు రెండో పేపర్ పరీక్షలకు పోలీసు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్ర వంశరాజ్ సంఘం నియామకాలు



నియామక పత్రాలను అందజేస్తున్న రాష్ట్ర వంశరాజ్ సంక్షేమ సంఘం నాయకులు

రామంతపూర్: వంశరాజ్ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా రామంతపూర్‌కు చెందిన పాశం వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా కంచుగట్ల లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం రాష్ట్ర వంశరాజ్ సంక్షేమ సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఇరిగిజ మురళీకృష్ణ, చిందం పాండు, ఉపాధ్యక్షుడు పాయసం గోపాల్ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు చిటికెల కృష్ణయ్య, మల్లేష్, సత్యనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎల్‌ఆర్ ఎన్‌క్లేవ్ వాసులు

కాప్రా: డీఎల్‌ఆర్ ఎన్‌క్లేవ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణికి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. కాలనీలో పార్క్‌కు కాంపౌండ్ వాల్ నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సెక్రెటరీ అశీష్ కుమార్, ట్రెజరర్ నవీన్‌కుమార్‌రెడ్డి, సభ్యులు రమణారెడ్డి, శివరామరెడ్డి, సుధాకర్, వెంకటేశ్వరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో ఇంటింటికీ బీజేపీ



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

మల్లాపూర్: సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రాగిరి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాచారంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రధాని మోదీ 9 సంవత్సరాల పాలన, అభివృద్ధి గురించి కరపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు అఖిల్‌దేవ్, ప్రకాష్, అనితారెడ్డి, నవీన్, శ్రీధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవికాంత్, నిర్మల, సాయి, అభిషేక్‌గౌడ్, దయాగౌడ్, నవీన్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు చర్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

కుషాయిగూడ: మధుర చారిటబుల్ ట్రస్ట్, కిమ్స్ ఆసుపత్రి సంయుక్తంగా ఆదివారం చర్లపల్లిలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు షూ పంపిణీ



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న దృశ్యం

మౌలాలి: ఆర్‌కేపురంలో ఉన్న సంచార జాతుల బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు శనివారం వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ, కాకతీయనగర్‌కు చెందిన శివరామప్రసాద్ సహకారంతో షూస్ పంపిణీ చేశారు. ఈ వసతి గృహానికి తాను ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో వసతి గృహం నిర్వాహకులు మహేష్, రవీంద్రనాథ్, కేదార్ శంకర్, రామకృష్ణరాజు, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే



నీటి కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలో మంచినీ సమస్య లేకండా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని సాయి బృందావన్ కాలనీ వెంకన్ననగర్‌లో ఆయన శనివారం స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌తో కలిసి మంచినీటి సరఫరా కుళాయిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సునీల్, సందీప్‌రెడ్డి, రాజశేఖర్, ఓంకార్‌రామ్, రతన్‌రెడ్డి, పరమేష్, శోబన్‌బాబు, నారాయణరెడ్డి, సులోచన, సరిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం డివిజన్‌లో....

వెంకటాపురం, బోయిన్‌పల్లి డివిజన్లలో సంయుక్తంగా రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్‌లు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో కాంగ్రెస్ భరోసా యాత్ర



నాచారంలో కాంగ్రెస్ భరోసా యాత్రలో పరమేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్: నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నాచారంలో నిర్వహించిన కాంగ్రెస్ భరోసా యాత్రకు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఏ–బ్లాక్ అధ్యక్షులు మందుముల్ల పరమేశ్వర్‌రెడ్డి హాజరై పాదయాత్ర నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 9 సంవత్సరాలుగా వరాలు కురిపించడం, హామీలు ఇవ్వడంతోనే సరిపెట్టుకున్నారన్నారు. ఏ ఒక్క వరం పేదలకు అందలేదని, ఇచ్చిన హామీలు గాలిలో కొట్టుకుపోయాయన్నారు. దళితులకు ఇచ్చే పథకం దళితబంధు బీఆర్‌ఎస్ పథకంగా మారిందన్నారు. ఇక బీసీ కుల వృత్తులకు సాయం పేరుతో ఓట్ల డ్రామా పథకం వచ్చిందని, ఇది పూర్తిగా బీసీలకు అన్యాయం చేసే పథకం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, రామ్‌రెడ్డి, మురళీగౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రమేష్‌గౌడ్, రామకృష్ణ పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో అభివృద్ధి శూన్యం



హెచ్‌బీకాలనీలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ ప్రభుత్వం చేసింది శూన్యమని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన ఉప్పల్ నియోజకవర్గం ,మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో బస్తీ నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని కైలాసగిరి, గాంధీనగర్, నవోదయనగర్, భక్షిగూడ, ఇంద్రనగర్ కాలనీల్లో పాదయాత్ర చేశారు. ఇంటింటికీ తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సముద్రాల కృష్ణమూర్తి, పోలేపాక అంజయ్య, జలగం వెంకటేష్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు వినతిపత్రం



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మారుతీనగర్ కాలనీ వాసులు

కుషాయిగూడ: కాలనీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ శనివారం మారుతీనగర్ కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో ఉన్న డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచడం, కొత్తగా కరంటు పోల్స్ ఏర్పాటుతో పాటుగా కాలనీలో ధ్వసంమైన మ్యాన్‌హోల్స్ నిర్మించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపుతానన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, కాలనీ అధ్యక్షుడు పలుగుల మహేందర్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



హనుమాన్‌పేట్ బ్రాంచ్‌లో కేక్‌కట్ చేస్తున్న మేనేజర్ నగేష్

గౌతంనగర్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఎస్‌బీఐ వెస్ట్ మల్కాజిగిరి శాఖ మేనేజర్ నగేష్ అన్నారు. శనివారం హనుమాన్‌పేట్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఎస్‌బీఐ 68వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఖాతాదారులకు పలు రకాల సబ్సిడీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌మయి. కుమార్, లక్ష్మణ్, శ్రీకాంత్, దివ్య, ఏవీ స్వామి తదితరులు ఉన్నారు.

మోదీపాలనలో అనేక సంక్షేమ పథకాలు



మల్కాజిగిరిలో జరిగిన ఇంటింటికి బీజేపీలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. శనివారం డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో ఆనంద్‌బాగ్ ప్రాంతంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కేరళ నుండి వచ్చిన విస్తరక్ సుజి, కార్పొరేటర్ శ్రవణ్‌లు మాట్లాడుతూ.. తొమ్మిది సంవత్సరాలలో మోదీ నాయకత్వంలో కేంద్రం పలు అభివృద్ధి పనులు తెలంగాణలో చేపట్టిందన్నారు. కార్యక్రమంలో రాంబాబు, రామక్రిష్ణ, వి.కె.మహేష్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో వృద్ధుడి ఆత్మహత్య



చంద్రారెడ్డి (ఫైల్)

ఉప్పల్: గత కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడికి గురవుతున్న వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రామంతాపూర్ శ్రీనివాసపురం ప్రాంతానికి చెందిన పి.చంద్రారెడ్డి(70) గత కొన్ని రోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గత మూడు రోజులుగా ఆహారం సరిగ్గా తీసుకోవడం లేదు. మానసిక ఒత్తిడికి గురవుతూ మన స్థాపానికి గురై శనివారం ఇంట్లో రెయిలింగ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన భార్య పుష్పమ్మ చిన్న కుమారుడికి సమాచారం ఇవ్వడంతోనే వెంటనే వచ్చి అతన్ని దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు గాంధీ ఆసుపత్రి డాక్టర్లు ధృవీకరించినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కిరణ్‌కుమార్

కుషాయిగూడ: అదుపుతప్పి ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. సైనిక్‌పురి, అంబేద్కర్‌నగర్‌లో నివసించే కొడిమెల్ల కిరణ్‌కుమార్ (30) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి భార్య అశ్విని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం భార్యకు చెప్పి బైక్‌పై వెళ్లాడు. ఈ క్రమంలో సైనిక్‌పురి, ఈసీఐఎల్ రోడ్డులో వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన కిరణ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఆర్టీసీ డ్రైవరు అజాగ్రత్తగా బస్సు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ. మూడు కోట్లతో మోడల్ శ్మశాన వాటిక

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో రూ. మూడు కోట్లతో మోడల్ స్మశాన వాటికను త్వరలో నిర్మించనున్నట్లు డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తెలిపారు. శనివారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. త్వరలో పనులను ప్రారంభించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్ రెడ్డి, రాజ్‌కుమార్, ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి డిగ్రీ కళాశాలలో బీబీఏ కోర్సు ప్రారంభం

అల్వాల్: 2023–24 విద్యా సంవత్సరం నుండి కళాశాలలో నూతనంగా 60 సీట్లతో బీబీఏ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుండి కళాశాలలో ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శైలజ తెలిపారు. దోస్త్ ద్వారా ప్రవేశం పొందిన రెండవ ఫేజ్ విద్యార్థులు ఈ నెల 5వ తేదీ లోపు రిపోర్టింగ్ చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రయ్య, టెక్నికల్ అసిస్టెంట్ రాహుల్ పాల్గొన్నారు. వివరాలకు 9392143106 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

అల్వాల్: అల్వాల్‌లోని పలు ఆలయాలలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అల్వాల్ హిల్స్‌లోని గోదాదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం, సిటిజన్ కాలనీలోని శ్రీ స్వయంభూ ఆంజనేయస్వామి ఆలయం, మచ్చబొల్లారంలోని సంజీవిని ఆంజనేయస్వామి ఆలయం, ఓల్డ్ అల్వాల్‌లో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



అల్వాల్: నందికంటి శ్రవణ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటాపురం మహాబోదిస్ స్కూల్ వద్ద శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో కొలెస్ట్రాల్, కిడ్నీ, బీపీ, షుగర్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు చేసి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. నాయకులు నిమ్మ అశోక్‌రెడ్డి, సీఎల్. యాదగిరి, కృష్ణగౌడ్, సంజీవ్‌కుమార్, శివశంకర్ పాల్గొన్నారు.

చెత్త సేకరణ సిబ్బంది డబ్బులు డిమాండ్ చెయవద్దు



అల్వాల్: ఇండ్ల నుండి చెత్తను సేకరించే ఆటో సిబ్బంది డబ్బులు డిమాండ్ చేయవద్దని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం అల్వాల్‌లోని తమ వార్డు కార్యాలయంలో సర్కిల్ ఏఎంహెచ్‌ఓ, పారిశుద్ధ ఎస్‌ఎఫ్ఏ, స్వచ్ ఆటో డ్రైవర్లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఆటో సిబ్బంది ఇండ్ల నుండి సేకరిస్తున్న చెత్తకు డబ్బులు డిమాండ్ చేయవద్దు అన్నారు. రూ. 100 రూపాయలకు మించి డిమాండ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ మంజుల, పారిశుద్ధ ఆటో సిబ్బంది, ఎస్‌ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నేత, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు జగదీశ్వర్‌గుప్త శనివారం పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. –అల్వాల్

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హబ్సిగూడ: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం శనివారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ఠాకూర్ ఇందర్‌సింగ్ మాట్లాడుతూ.. పెన్షనర్లకు ప్రతి నెలా మొదటి తేదీన పెన్షన్లు చెల్లించాలని, ఈహెచ్‌ఎస్ అమలు చేయాలని, పెండింగ్ రెండు డీఆర్‌లు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సదానంద్‌గౌడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ పుండరికరెడ్డి, ట్రెజరర్ రామ్‌చంద్రారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: వెంకటేశ్వరనగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. శనివారం కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు పురాతన డ్రైనేజీ వలన తరచూ మురుగునీరు రోడ్డు మీద ప్రవహిస్తోందని సమస్య పరిష్కరించాలని కోరారు. డ్రైనేజీ పూర్తయిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని , కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాల ఏర్పాటు అవసరముందని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులను ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించామన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నవీన్, సత్యనారాయణ, సంపత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పార్క్‌ను పట్టించుకోండి సారూ..



కాప్రా సైనిక్‌పురిలో జీహెచ్‌ఎంసీ పార్క్‌లో విరిగిపోయిన చిన్నారుల ఆటవస్తువులు

కాప్రా: సైనిక్‌పురిలో గల జీహెచ్‌ఎంసీ పార్క్‌పై అధికారులు దృష్టిసారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో పార్క్‌కు వచ్చే సందర్శకులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లల ఆట వస్తువులు విరిగిపోవడంతో పార్క్‌లో చిన్నారులు సరదాగా గడపలేకపోతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. విరిగిన ఆట వస్తువులపై పిల్లలు ఆడుకోవడంతో ఎక్కడ ప్రమాదాల బారిన పడుతారోనని భయంతో పార్క్‌లో కాలం వెళ్లదీయాల్సి వస్తుందని సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్క్‌లో నీటి వసతి లేక, మరుగుదొడ్ల సమస్య కూడా ఉండటంతో పార్క్‌లో సరదాగా కాసేపు గడపాలనుకునే సందర్శకులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సైనిక్‌పురిలో గల జీహెచ్‌ఎంసీ పార్క్‌లో సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మౌలాలిలో వికాస్ యాత్ర



మౌలాలిలో వికాస్ యాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: మౌలాలి ఆర్కే సొసైటీ కాలనీలో శనివారం కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో మౌలాలి వికాస్ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని మోదీ పథకాలు ఎన్నో అమలు అవుతున్నాయన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ నుండి మౌలాలికి నిధులు రాలేవని, జీహెచ్‌ఎంసీ నిధులలో కేంద్రం నిధులు కూడా ఉన్నాయన్నారు. తాను కార్పొరేటర్ అయినప్పటి నుండి సుమారు రూ. 15 కోట్ల వరకు జీహెచ్‌ఎంసీ నిధులు తీసుకువచ్చి డివిజన్‌ను అభివృద్ధి చేశానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జీజు విజయన్, మధుసూదన్‌చారి, నాగేశ్వర్‌రావు, రాదాబాయి, సుజాత పాల్గొన్నారు.

తెలంగాణ జైళ్లశాఖ సంస్కరణలు భేష్



ఖైదీల ఉత్పత్తులను పరిశీలిస్తున్న పంజాబ్ జైళ్లశాఖ డీజీ అరుణ్‌పాల్ సింగ్

కుషాయిగూడ: ఖైదీల సంక్షేమానికి తెలంగాణ జైళ్లశాఖ చేపడుతున్న సంస్కరణలు భేష్ అని పంజాబ్ జైళ్లశాఖ డైరక్టర్ జనరల్ అరుణ్‌పాల్‌సింగ్ అన్నారు. శనివారం చర్లపల్లి కేంద్రకారాగారాన్ని ఆయన సందర్శించారు. జైల్‌లో ఖైదీల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను తెలుసుకున్నారు. జైల్‌లోని అన్నపూర్ణ, ఆసుపత్రి, బ్యారక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జైల్ ఉత్పత్తులు, ఖైదీల ఉపాధి మార్గాలను తెలుసుకున్న ఆయన జైళ్లశాఖ అధికారులను అభినందించారు. తెలంగాణ జైళ్లశాఖ సంస్కరణలు ఆదర్శప్రాయం, ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో జైళ్లశాఖ అధికారులు వై. రాజేష్, మురళీబాబు, సంతోష్‌కుమార్, కృష్ణమూర్తి, శశికాంత్, డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారంతాపు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్యరత్నరమణి సిద్ది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెల నెల కళారాధన ఉత్సవాల్లో భాగంగా సంగీత నృత్య కార్యక్రమాలను నిర్వహించారు. పద్మ ప్రతీక్ శిష్యబృందం నిర్వహించిన సంగీత కచేరిలో స్వరాలు, గీతాలు, స్వరజతి, అన్నమాచార్య, రామదాసు, కీర్తనలు, భజనలు, మంగళం పాటలను ఆలపించారు. నారాయణ శిష్య బృందం చే నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ఇందుమతి శ్యామ్ కుమార్ ఆత్మీయ అతిథిగా విచ్చేసి కళాకారులను సత్కరించారు.

ఆకట్టుకుంటున్న కళా సిల్క్ ఎగ్జిబిషన్



చేనేత హస్తకళా ప్రదర్శనలో వస్త్రాలను కొనుగోలు చేస్తున్న నగర వాసులు



లాలాపేట: తార్నాకలోని ఐఏసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత హస్తకళా వస్త్ర ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంటోంది. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన చేనేత హస్త కళాకారులు 70కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం నిర్వాహకులు వికాస్ జైన్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వినియోగదారులకు వస్త్ర మేళా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ వస్త్ర ప్రదర్శన జూలై 10 వరకు కొనసాగుతుందన్నారు.

పలు రాష్ట్రాల చేనేత, హస్త కళా ఖండాలు

ఈ మేళాలలో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన చేనేత హస్త కళాకారులు స్వయంగా తయారు చేసిన చేనేత వస్త్రాలతో పాటు పోచంపల్లి, ఇక్కత్, బాగల్పూరి, జాంధాన్ని, బెంగాలి కాటన్, ఉప్పాడ, ధర్మవరం, వేంకటగిరి సిల్క్ శారీస్,జైపూర్ కాటన్ వస్త్రాలు ఈ ప్రదర్శనలో కొలువు దీరాయి. దీంతో పాటు జ్యూట్ బ్యాగ్స్, 1 గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ తదితర వస్తువులతో, కళాఖండాలు నగర వాసులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయి.